దారేడు చెరువుశిఖం కబ్జా

- మట్టి పోసి ఫెన్సింగ్ వేసిన ఆక్రమణదారులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆనవాళ్లు కోల్పోయిన కాకతీయుల కాలంనాటి చెరువు
- చెరువును కాపాడాలంటున్న కోయచలక గ్రామస్తులు

చెరువు శిఖాన్ని ఆక్రమించి ఫెన్సింగ్ వేసుకున్న దృశ్యం

రఘునాథపాలెం, జూన్ 11 : కాకతీయుల కాలంనాటి చెరువులు కానరాకుండా పోతున్నాయి. ఆక్రమణదారుల చెరలో చిక్కి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. భవిష్యత్తు తరాలకు ఒకప్పుడు ఇక్కడ చెరువు ఉండేది అని చెప్పుకునే దుస్థితికి చేరుతున్నాయి. ఇందుకు ఉదాహరణే.. రఘునాథపాలెం మండలం కోయచలక పరిధిలో ఆక్రమణకు గురైన దారేడు చెరువు. చెరువును ఆక్రమిస్తున్నారు.. కాపాడండి మహాప్రభో..! అని గ్రామస్తులు మొరపెట్టుకున్నా.. పట్టించుకోని పరిస్థితి. అధికారుల పట్టింపులేనితనంతో చెరువు ఆయకట్టు రైతులు 'నమస్తే తెలంగాణ'ను ఆశ్రయించారు. కోయచలక గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 35లోని దారేడు చెరువు కనుమరుగవుతున్నది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా అధికారుల తీరు కనిపిస్తున్నది. ఫిర్యాదు అందగానే చర్యలు తీసుకుంటే వందల ఎకరాల్లో ఉన్న చెరువు కబ్జా కాకుండా ఉండేది కదా అని గ్రామస్తులు వాపోతున్నారు. దారేడు చెరువు కోయచలక, దారేడు, కోటపాడు గ్రామాల రైతుల పంటలకు సాగునీరు అందించే కల్పతరువుగా పేరొందింది. అయితే కోయచలక గ్రామానికి చెందిన కొందరు రైతులు శిఖానికి అనుకొని ఉన్న తమ భూములతో కొంత భూములను కలుపుకొని ఎంఛక్కా సాగు చేసుకుంటున్నారు. ఇలా అనేకమంది రైతులు చెరువు శిఖమే కదా అని ఎవరికి వారుగా ఆక్రమించుకోవడంతో 20ఎకరాలకు పైగానే ఆక్రమణకు గురైనట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్, ఆర్‌డీవో, కలెక్టర్, మంత్రులు, ఎంపీలకు సైతం ఫిర్యాదు చేయడం జరిగింది. కానీ ఫిర్యాదులపై ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు దర్జాగా తాము ఆక్రమించుకున్న చెరువుశిఖం భూమిలో మట్టి పోసుకొని ఎత్తు పెంచుకున్నారు. అప్పటికీ అధికారులు మిన్నకుండిపోవడంతో ఫెన్సింగ్ చేసుకొని సొంతం చేసుకున్నారు. శిఖం భూమి మా సొంతమైనట్లేనని మురిసిపోతున్నారని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి చెరువుశిఖం సర్వే చేసి దారేడు చెరువును ఆక్రమణల బారి నుంచి కాపాడాలని వేడుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

'బడిబాట' కార్యక్రమ ప్రదర్శనల్లో ఉపాధ్యాయులు

కూసుమంచి బడిబాటలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మధిర : మడుపల్లిలో..

కూసుమంచి/ మధిర, జూన్ 11 : సర్కారు స్కూళ్లలోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. నిపుణులైన టీచర్లు ఇక్కడ విద్యాబోధన చేస్తారని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన 'బడిబాట' కార్యక్రమంలో భాగంగా కూసుమంచి, మధిర మండలాల్లో విద్యాశాఖ అధికారులు మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులూ ఉన్నాయని అన్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులవంటివన్నీ ఉచితంగా లభిస్తాయని వివరించారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కూసుమంచిలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు రాయల వీరస్వామి, నూర్జహాన్, అనిత, అనురాధ, వెంకటేశ్వర్లు, మధిరలో తోట నరసింహారావు, బూసా కోటేశ్వరరావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కే.నాగమణి పాల్గొన్నారు.

ఖమ్మం రూరల్లో ఆటో ద్వారా ప్రచారం..

ఖమ్మం రూరల్, జూన్ 11: బడిబాట కార్యక్రమాన్ని ఖమ్మం రూరల్ విద్యాశాఖ అధికారులు వినూత్న రీతిలో చేపట్టారు. జలగంనగర్ పాఠశాల ఉపాధ్యాయులు ఆటోకు మైక్ కట్టి కాలనీల్లో ప్రచారం చేశారు. కూడళ్లలో ఎంఈవో శ్యాంసన్ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో సుమారు 100 మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించారు. ఉపాధ్యాయులు మాధవిలత, పద్మావతి, వరలక్ష్మి, శైలజ, కృష్ణవేణి, సాజిదాబేగం, రాజు పాల్గొన్నారు.

కొమ్ముగూడెంలో బడిబాట ర్యాలీ

పెనుబల్లి, జూన్ 11: మండలంలోని కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలల ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, రాజేశ్, ఉపాధ్యాయులు కృష్ణయ్య, ప్రకాశం, రాంబాబు, వీరభద్రం, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంసూరులో..

వేంసూరు, జూన్ 11: వేంసూరు ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం సీహెచ్ చిన్నవెంకటేశ్వరరావు ఇంటింటికి తిరిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవు

ఎమ్మెల్యే రాగమయి

చెరువు తూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, జూన్ 11: ప్రభుత్వ భూములను, చెరువు శిఖాలను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రాగమయి అన్నారు. మంగళవారం పట్టణ శివారులోని వేశ్యకాంతలచెరువు, తామరచెరువు, గాడిదలవాగును ఆమె అధికారులతో కలిసి పర్యటించారు. వేశ్యకాంతల చెరువు మెరక తూమును మరమ్మతులు చేయాలని రైతులు కోరగా ఇరిగేషన్ అధికారులకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వేశ్యకాంతల చెరువు కట్ట, ఎన్టీఆర్‌కాలువ కట్టపై వర్షాకాలం ప్రారంభం కాగానే మొక్కలు నాటి సింగరేణి వారిచే సంరక్షణ బాధ్యలు తీసుకునే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ కెనాల్ మీదుగా బేతుపల్లి చెరువు వద్దకు వెళ్లి కాలువను పరిశీలించారు. అనంతరం గాడిదలవాగును పరిశీలించి వాగు ఆక్రమణకు గురైందని, రైతులు తమ దృష్టికి తీసుకురాగా ఆక్రమణలో ఉన్న వాటిని తొలగించి వేశ్యకాంతుల చెరువు వరకు వాగునీరు వెళ్లే చూడాలని అధికారులను ఆదేశించారు. చెరువు భూములను సర్వే చేయించి భూఆక్రమణలు జరగకుండా సర్వేరాళ్లు వేసి ప్రభుత్వ భూములు కాపాడాలన్నారు. ఆమె వెంట నాయకులు మట్టా దయానంద్, చల్లగుండ్ల నర్సింహారావు, కమల్‌పాషా, శ్యాముల్, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఆక్రమణ భూమిలో గోడల తొలగింపు

సుమారు 20 కుంటల ప్రభుత్వ భూమి స్వాధీనం

కూసుమంచి, జూన్ 11: కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో ఆక్రమణకు గురైన సుమారు 20 కుంటలపైగా ఉన్న ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దానిలో ఉన్న గోడలను కూల్చివేశారు. అధికారుల కథనం ప్రకారం.. నాయకన్‌గూడెంలో గతంలో కొందరు వ్యక్తులు మరోకొంతమంది వ్యక్తులకు ప్రభుత్వ భూమిని విక్రయించారు. మిగిలిని భూమికి గోడలు నిర్మించారు. ఈ ఆక్రమణ భూమి విలువ రూ.కోటి వరకూ ఉంటుంది. అయితే రెండు రోజుల కిందట మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గ్రామంలో పర్యటించిన సందర్భంగా గ్రామస్తులు ఈ ఆక్రమణ గురించి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశం మేరకు రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించారు. దానిని ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ఈ మేరకు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

60 మి.మీ వర్షం కురిశాకే విత్తనాలు విత్తాలి: ఏడీఏ

కూసుమంచి రైతు వేదికలో మాట్లాడుతున్న ఏడీఏ విజయ్ చంద్ర, ఏవో వాణి

కూసుమంచి, జూన్ 11: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ విజయ్‌చంద్ర స్పష్టం చేశారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు కచ్చితంగా వారికి రసీదులు కూడా అందజేయాలని సూచించారు. కూసుమంచిలోని రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 60 మిల్లీ మీటర్ల వర్షం కురిసిన తరువాతే రైతులు తమ పంట చేలలో విత్తనాలు విత్తాలని సూచించారు. తొలకరిలోనే విత్తనాలు విత్తితే ఒకవేళ వర్షాలు కొంచెం ఆలస్యమైనా విత్తనాలు చనిపోయే అవకాశం ఉందని అన్నారు. దానివల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందుకని స్పష్టత వచ్చాకే రైతులు విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. అలాగే, డివిజన్‌లో డిజిటల్ గ్రీన్ అనే ఎన్జీవో సంస్థ ద్వారా చేపడుతున్న సాగు బాగు కార్యక్రమాల గురించి బిజేత్రిరాయ్, దేబేశ్ రాయ్‌లు రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఏవో రామడుగు వాణి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు అభినందనీయం

సత్తుపల్లి, జూన్ 11: సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని సీఐ వెంకటేశ్ అన్నారు. కల్లూరు బస్టాండ్‌లో వేసవిలో ప్రయాణికులకు 70 రోజుల పాటు దాతల సహకారంతో అందించిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ మాట్లాడారు. దాత ఆళ్లకుంట నర్సింహారావును సత్కరించారు. కార్యక్రమంలో విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, నాయకులు పసుమర్తి చంద్రరావు, లక్కినేని రఘు, పంచాయతీ ఈవో కృష్ణారావు, ఎల్‌డీసీ శ్యాముల్, దారా రంగ, ఉస్మాన్, త్రినాథ్, రాము, రుక్మిణి, దామాల సురేశ్, బైర్ల కాంతారావు, లయన్స్‌క్లబ్ బాధ్యులు చలువాది నగేశ్, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

సత్తుపల్లి టు విజయవాడ ప్రత్యేక బస్సులు

సత్తుపల్లి, జూన్ 11 : సత్తుపల్లి నుంచి విజయవాడకు ఆరు డీలర్సు బస్సులు నడుపుతున్నామన్నారు. అదేవిధంగా సిద్ధారం, సదాశివపేట, భీమవరం, మర్లపాడు మీదుగా ప్రతిరోజు బీహెచ్ఈఎల్‌కు సూపర్‌లగ్జరీ సర్వీస్ నూతనంగా ప్రారంభమవుతుందని వివరించారు. త్వరలోనే అశ్వారావుపేట, మందలపల్లి, దమ్మపేట మీదుగా నుంచి విజయవాడకు ఉదయం 6 గంటలకు ఒక బస్సు ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి కోరారు.

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం

ల్యాప్‌టాప్ అందిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం ఎడ్యుకేషన్/మామిళ్లగూడెం, జూన్ 11: హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు మద్దినేని ప్రసాద్‌రావు, కమల ఆర్థిక సహకారంతో డిగ్రీ విద్యార్థిని యోగినాటి హారికకు రూ.40వేల విలువగల ల్యాప్‌టాప్‌ను కలెక్టర్ గౌతమ్ అందజేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో ల్యాప్ టాప్ అందించి సంస్థ సభ్యులను అభినందించారు. కొంగర పురుషోత్తమరావు, రాయల నరసింహారావు, యలమద్ది వెంకటేశ్వర్లు, వైవి, మద్దినేని రవి పాల్గొన్నారు.

గ్రామ సమాఖ్య నిధులు కాజేసిన గ్రామదీపిక

రూ.30 లక్షలు సొంతానికి వాడుకున్నట్లు అంగీకారం

బ్యాంకు ఎదుట ఆందోళన చేసిన ఎస్‌హెచ్‌జీల సభ్యులు

బ్యాంకు ఎదుట ఆందోళన చేపడుతున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు

ఎర్రుపాలెం, జూన్ 11: గ్రామ సమాఖ్య నిధులను గ్రామదీపిక కాజేసిన అంశంపై స్వయం సహాయక సంఘాల సభ్యులు మంగళవారం ఆందోళన చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వెంకటాపురం స్త్రీనిధి గ్రామసమాఖ్య నిధుల మాయంపై జమలాపురం యూనియన్ బ్యాంకు ఎదుట ఎస్‌హెచ్‌జీల సభ్యులు మంగళవారం ఆందోళనకు దిగారు. దీంతో బ్యాంకు ఖాతాలను పరిశీలించగా అదే వెంకటాపురం గ్రామానికి చెందిన శ్రీకృష్ణ గ్రామదీపిక కుంపటి కన్నయ్య గ్రామంలోని స్వయం సహాయక సంఘాల నిధులు సుమారు రూ.30 లక్షలను గ్రూపు సభ్యులకు తెలియకుండా డ్రా చేసినట్లు తేలింది. పైగా వాటి చెల్లింపులు జరపడం లేదు. దీంతో అప్పటికే కన్నయ్య తీసుకొచ్చిన ఎస్‌హెచ్‌జీల సభ్యులు బ్యాంకు అధికారులు, పెద్ద మనుషుల ముందు నిలదీశారు. దీంతో తానే ఆ నిధులు డ్రా చేశానని, తన సొంతానికి వినియోగించుకున్నానని అంగీకరించాడు. దీంతో పెద్ద మనుషులు కూడా అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే నెల రోజుల వ్యవధిలో వడ్డీతో సహా మొత్తం నిధులను సమాఖ్య ఖాతాల్లో జమ చేస్తానని పెద్ద మనుషుల సమక్షంలో కన్నయ్య హామీ ఇచ్చి ఒప్పంద పత్రం రాసి ఇచ్చాడు. దీంతో గ్రూపు సభ్యులు ఆందోళన విరమించారు.

ఎస్‌హెచ్‌జీలు లావాదేవీలను సరిచూసుకోవాలి: మేనేజర్

ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ శ్రీనాథ్ మాట్లాడుతూ.. గ్రామసమాఖ్య సంఘాల సభ్యులు కన్నయ్యను గుడ్డిగా నమ్మడం వల్లనే అతడు వారి ఖాతాల్లో లావాదేవీలను జరిపాడని అన్నారు. గ్రామ సమాఖ్యల సభ్యులు తరచూ బ్యాంకు వద్దకు వచ్చి లావాదేవీలను సరిచూసుకోవాలని సూచించారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

రఘునాథపాలెం, జూన్ 11: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి పెండింగ్ వేతనాల విడుదలకు హామీ ఇచ్చారు. గాదె లక్ష్మీనారాయణ, పిట్టల మల్లయ్య, మంగీలాల్, రాజగోపాల్, లింగయ్య, సీతారాములు, రేణుక, విజయలక్ష్మి, కోటేశ్వరరావు, రాజు, లలి తమ్మ, శ్రీను, సైదులు, వీరన్న, సాంబ ఉన్నారు.

జిల్లాలో ఇద్దరు సీఐల బదిలీ

మామిళ్లగూడెం, జూన్ 11: ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీపీ రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం సీఎస్‌బీ-4 సీఐగా విధులు నిర్వహిస్తున్న కే.సతీష్‌ను పాల్వంచ టౌన్ ఎస్‌హెచ్‌వోగా బదిలీ చేశారు. అదేవిధంగా ఖమ్మం డీటీసీలో పనిచేస్తున్న పి.వెంకన్నను వరంగల్ కమిషనరేట్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీపీఎం శిక్షణా తరగతులు ప్రారంభం

వైరాటౌన్, జూన్ 11: సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులు స్థానిక మధు విద్యాలయంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు చింతనిప్పు చలపతిరావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఉదయం జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు 'వర్తమాన రాజకీయాలు'పై బోధించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో 'మతం, మతోన్మాదం'పై వైరా స్టడీ సర్కిల్ కన్వీనర్ బోడపట్ల రవీందర్ బోధించారు.

'పాలెం'లో మొదలైన 'రైతునేస్తం'

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

రఘునాథపాలెం, జూన్ 11 : సాగులో రైతులకు మెళకువలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతునేస్తం కార్యక్రమం మంగళవారం రఘునాథపాలెం మండలంలో ప్రారంభమైంది. వీ వెంకటాయపాలెం రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. అధిక సాంద్రత, పత్తిసాగు వివరాలు, విత్తన ఎంపికలో జాగ్రత్తలపై తొలిరోజు వివరించారు. డీహెచ్ఎస్‌వో సరిత, ఏడీఏలు సరిత, శ్రీనివాసరావు, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ కో-ఆర్డినేటర్ నల్లమల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ యరగర్ల హనుమంతరావు, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, కామేపల్లి మండలాల వ్యవసాయ అధికారులు, ఏఈవోలు, ఖమ్మం డివిజన్ రైతులు పాల్గొన్నారు.

పత్తిపంటను పరిశీలించిన ఏవో

కొణిజర్ల, జూన్ 11: కొణిజర్ల గ్రామంలో రొంట సత్యనారాయణ రైతు సాగు చేసిన పత్తి పంటను మంగళవారం మండల వ్యవసాయాధికారి బాలాజీ పరిశీలించారు. ముందుగా తొలకరి వర్షాలు రావడంతో పత్తి పంట వేసుకోవడానికి వాతావరణం అనుకూలించడంతో జిల్లాలో మొదటిగా పత్తి వేశారన్నారు. పత్తి విత్తనాలు ముందు వేసుకోవడంతో నవంబర్‌లో పత్తి పంట తీసివేసి మొక్కజొన్న, పెసర వేసుకోవడానికి వీలు కలుగుతుందని తెలిపారు. ఇంకొక వర్షం కురిస్తే మండలంలో రైతులు పూర్తిస్థాయిలో పత్తిపంట వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు సరిత, కుమార్‌రాజా, రైతులు పాల్గొన్నారు.

రామిశెట్టి కుటుంబానికి సండ్ర పరామర్శ

సత్తుపల్లి, జూన్ 11: జిల్లా మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు, సత్తుపల్లి పట్టణానికి చెందిన రామిశెట్టి సుబ్బారావు సతీమణి లక్ష్మీసరోజిని అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఫోన్‌ద్వారా వారి కుటుంబానికి సంతాపం, సానుభూతి తెలిపారు. అదేవిధంగా మంగళవారం లక్ష్మీసరోజిని భౌతికకాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో సంఘ నాయకులు వీ చెంచురెడ్డి, కేశవరెడ్డి, భద్రుద్దీన్, అద్దంకి వెంకటరత్నం, బోడేపూడి బాబు, మోహన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, వెంకట్రామిరెడ్డి, అప్పారావు, ప్రకాశ్‌రావు, బూరుగు దాసు, మధుసుదన్‌రాజు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వైరారూరల్, జూన్ 11: మండలంలోని పాలడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పులిగుట్ట లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో మంగళవారం 2001-02 విద్యా సంవత్సరానికి చెందిన పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఎంతో సరదాగా గడిపారు. గద్దల లక్ష్మాద్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మోదుగు వినోద్‌కుమార్, నాగేశ్వరరావు, పర్వీన్, శ్రీవాణి, కృష్ణవేణి, వెంకట్రావు, రవి, శైలజ, కుష్మావతి, కవిత, తోట నర్సింహారావు, తెనాలి నర్సింహారావు, కిరణ్, నాగమణి, మజీద్, సురేశ్, లక్ష్మి, కృష్ణయ్య, కృష్ణవేణి, హలీమ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

వైరాటౌన్, జూన్ 11: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. వైరాలోని మిట్టపల్లి గార్డెన్‌లో జరిగిన నాయీబ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వం, జిల్లాలోని ముగ్గురు మంత్రుల దృష్టికి తీసుకెళ్లి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నాయకులు బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, ఏదునూరి సీతారాములు, శీలం వెంకటనర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక సమావేశం

ఖమ్మం, జూన్ 11: ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెంలో ఉన అఖిల భారత బ్రాహ్మణ (సర్వీస్) నెట్‌వర్క్ హెల్ప్‌లైన్ కార్యాలయంలో మంగళవారం బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బ్రాహ్మణుల సమస్యలపై మంత్రులు బట్టి, పొంగులేటి, తుమ్మలను కలిసి వినతులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. మారం రాజు రాధాకృష్ణ, గెంటాల శ్రీనివాసరావు, సూరావజ్జుల వాసు, రావులపాటి శ్రీనివాసరావు, శ్రీకాంత్, మాటూరు లక్ష్మీనారాయణ, శివరాజు శ్రీరమ ఉన్నారు.

బీఏఎస్‌లో విద్యార్థుల ఎంపిక పూర్తి

మామిళ్లగూడెం, జూన్ 11: బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియను మంగళవారం పూర్తి చేశారు. డీపీఆర్‌సీ భవనంలో మంగళవారం జిల్లా ఎంపికల కమిటీ సమక్షంలో లాటరీ పద్ధతిన ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ పథకం ద్వారా నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో 1వ తరగతిలో ప్రవేశాలకు 128 సీట్లకు 309 దరఖాస్తులు, 5వ తరగతికి 397 దరఖాస్తులు రావడంతో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, భూలక్ష్మీ, జ్యోతి, హనుమంతరావు, ఆర్‌వీఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి టయోటా అర్బన్ 'క్రూజర్ టైజర్'

నూతన కారును ఆవిష్కరిస్తున్న లేబర్ అధికారి కాశీ విశ్వనాథ శాస్త్రి

రఘునాథపాలెం, జూన్ 11: సరికొత్త మోడల్ కార్ల తయారీ దిగ్గజ సంస్థ టయోటా మార్కెట్‌లోకి మరో నూతన వాహనాన్ని తీసుకొచ్చింది. అర్బన్ క్రూజర్ టైజర్ పేరుతో కొత్త మోడల్ కారును మంగళవారం వైరా రోడ్డులోని కాకతీయ టయోటా షోరూంలో ఆవిష్కరించారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కాశీ విశ్వనాథ్ శాస్త్రి పాల్గొన్నారు. నూతన కారు విశిష్టతలను కాకతీయ సేల్స్ మేనేజర్ రాంబాబు వివరించారు.

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్
వేలం కోసం బహిరంగ ప్రకటన
తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటి నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (''బంగారు రుణ సౌకర్యం'') తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/ హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తాకట్టు ఇన్‌వాక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రికోర్స్ పద్ధతి లేని విధంగా''
తేది:22 జూన్ 2024న మ. 12.30 గం. నుండి మ. 3.30 గం. మధ్య (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.
రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

క్ర. సం.	బ్రాంచ్ పేరు	రుణ ఖాతా సం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	ఖమ్మం	XXXXXXXXXXX2831	కర్లపూడి కిరణ్ బాబు	76129	28-ఫిబ్రవరి-24	20.6	18.9
2	ఖమ్మం